# ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డికి శుభాకాంక్షల వెల్లువ



ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డికి శుభాకాంక్షలు తెలుపుతున్న పురం మహేశ్



దుబ్బాక ఎమ్మెల్యేగా గెలిచిన కొత్త ప్రభాకర్‌రెడ్డిని కలిసిన చెట్లతిమ్మాయిపల్లి సర్పంచ్ పాలక వర్గం సభ్యులు

మనోహరాబాద్, డిసెంబర్ 4: దుబ్బాక నియోజకవర్గం నుంచి ఎమ్మెల్యేగా గెలుపొందిన బీఆర్ఎస్ అభ్యర్థి కొత్త ప్రభాకర్‌రెడ్డిని మనోహరాబాద్ మండల నాయకులు సోమవారం కలిసి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు పురంమహేశ్, రైతుబంధు మండల కో ఆర్డినేటర్ సుధాకర్‌రెడ్డి, పెంటాగౌడ్, ప్రభాకర్‌రెడ్డి, సంతోశ్, హరేందర్, షాపోద్దిన్ పాల్గొన్నారు.

**చేగుంటలో..**

చేగుంట, డిసెంబర్ 4: బీఆర్ఎస్ దుబ్బాక ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి భారీ మెజార్టీతో గెలువడంతో చేగుంట, నార్సింగి మండలాల అభిమానులు, నాయకులు, కార్యకర్తలు గ్రామాల్లో పెద్దఎత్తున పటాకులు కాల్చి సంబురాలు జరుపుకొన్నారు. దుబ్బాకలోని ప్రభాకర్‌రెడ్డి క్యాంపు కార్యాలయంలో పలువురు నేతలు, యూత్ సభ్యులు సోమవారం కలిసి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో చేగుంట ఎంపీపీ మాసుల శ్రీనివాస్, ఎంపీటీసీలు బింగి గణేశ్, హోళియ నాయక్, నవీన్, గాండ్ల లతానందం, అయిత వెంకట లక్ష్మీ రఘు రాములు, సర్పంచులు బుడ్డ స్వర్ణలత భాగ్యరాజ్, మోహన్ ఉన్నారు.



కొత్త ప్రభాకర్‌రెడ్డి చేగుంట మండలం చందాయిపేట సర్పంచ్ బుడ్డ స్వర్ణలత భాగ్యరాజ్, పాలక వర్గం సభ్యులు



విలేకర్లతో మాట్లాడుతున్న వంటేరు ప్రతాప్‌రెడ్డి

# రైతాంగానికి వెన్నుదన్నుగా కేసీఆర్

**ఎఫ్‌డీసీ మాజీ చైర్మన్ వంటేరు ప్రతాప్‌రెడ్డి**

గజ్వేల్, డిసెంబర్ 4 : గత పదేండ్లలో కేసీఆర్ రైతాంగానికి వెన్నుదన్నుగా నిలిచారని, కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మించి రైతులకు సాగునీరందించిన ఘనత కేసీఆర్‌కే దక్కుతుందని ఎఫ్‌డీసీ మాజీ చైర్మన్ వంటేరు ప్రతాప్‌రెడ్డి అన్నారు. సోమవారం గజ్వేల్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. మూడోసారి గజ్వేల్ ఎమ్మెల్యేగా కేసీఆర్‌ను గెలిపించుకున్న నియోజకవర్గ ప్రజలకు ధన్యవాదాలు తెలిపారు. ఎన్నికల్లో కేసీఆర్‌కు 45,031 మెజార్టీ వచ్చిందని, కష్టపడి పనిచేసిన ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలకు కృతజ్ఞతలు తెలిపారు. రాష్ర్టానికి ఎనలేని సేవ చేసిన కేసీఆర్‌ను ప్రతి ఒక్కరూ గుర్తు చేసుకునే రోజులు వస్తాయన్నారు. తెలంగాణ నుంచి పీవీ నర్సింహారావు ప్రధానమంత్రి అయినా రాష్ట్రం అభివృద్ధి చెందలేదని, బీఆర్ఎస్ పదేండ్లలోనే తెలంగాణను అన్నిరంగాల్లో అభివృద్ధి చేశారని తెలిపారు. కేసీఆర్ 14 ఏండ్లపాటు ప్రతిపక్షంలో ఉండి తెలంగాణ సాధించారన్నారు. రూ.250 కోట్లతో గజ్వేల్‌లో కొనసాగుతున్న అభివృద్ధి పనులను ప్రభుత్వం పూర్తి చేయాలని కోరారు. సమావేశంలో మున్సిపల్ చైర్మన్ రాజమౌళి, ఎంపీపీ అమరావతి, జడ్పీటీసీ మల్లేశం, మాజీ ఏఎంసీ చైర్మన్ మాదాసు శ్రీనివాస్, బీఆర్ఎస్ మండలాల అధ్యక్షులు బెండె మధు, కరుణాకర్‌రెడ్డి, నవీజ్‌మీరా, నాయకులు కృష్ణారెడ్డి, చంద్రమోహన్‌రెడ్డి, రవీందర్‌రావు, విరాసత్ అలీ, రమేశ్‌గౌడ్, రఘుపతిరెడ్డి, గంగిశెట్టి రవీందర్, స్వామిచారి, దుర్గాప్రసాద్, అల్తాఫ్ పాల్గొన్నారు.

## సమస్యల పరిష్కారానికే ప్రజావాణి

మెదక్ అర్బన్, డిసెంబర్ 4: ప్రజా సమస్యల పరిష్కారానికే ప్రజావాణిని నిర్వహిస్తున్నామని మెదక్ జిల్లా అదనపు ఎస్పీ అడ్మిన్ మహేందర్ అన్నారు. సోమవారం జిల్లా పోలీస్ ప్రధాన కార్యాలయంలో అడ్మిన్ మహేందర్ ఆధ్వర్యంలో ప్రజావాణి కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా నలుమూలల నుంచి అర్జీదారుల ఫిర్యాదులను స్వీకరించారు. శివ్వంపేట మండలం గోమారం గ్రామానికి చెందిన షబానా తన భర్త యాసినుద్దీన్‌కి రెండో భార్యనని, తనకు ఇద్దరు కూతుళ్లు ఉన్నారని, తన భర్త దురలవాట్లతో వ్యవసాయ భూమిని తనకు తెలియకుండా విక్రయించినట్లు పేర్కొంది. మమ్మల్ని చంపాలనే ఉద్దేశంతో ఇంటికి నిప్పు పెట్టాడని తెలిపింది. ప్రస్తుతం కాలిపోయిన ఇంటి పక్కనే పిల్లలతో కిరాయికి ఉంటున్నానని, నిప్పు పెట్టిన ఇంటిని అమ్మడానికి చూస్తున్నాడని అడ్మిన్ మహేందర్‌కు తెలిపారు. తన భర్త నుంచి ప్రాణరక్షణ కల్పించి తనకు న్యాయం చేయాలని ఫిర్యా దు చేసింది. శివ్వంపేట ఎస్సైకి ఎస్పీ అడ్మిన్ మహేందర్ సమస్యను పరిష్కరించాలని సూచించారు.

# ఈవీఎంల రక్షణ చర్యలు పర్యవేక్షణ

సిద్దిపేట అర్బన్, డిసెంబర్ 4 : గోడౌన్లలో భద్రపర్చిన ఈవీఎంల రక్షణ చర్యలను కలెక్టర్, సిద్దిపేట జిల్లా ఎన్నికల అధికారి ప్రశాంత్ జీవన్ పాటిల్ పర్యవేక్షించారు. ఓట్ల లెక్కింపు పూర్తయిన అనంతరం కలెక్టరేట్ పక్కన గల గోడౌన్‌తో పాటు కొండపాక మార్కెట్ కమిటీ గోడౌన్‌లో ఈవీఎంలను భద్రపర్చగా సోమవారం ఆయన ఆయా గోడౌన్ల వద్ద రక్షణ చర్యలను పరిశీలించి.. విధులు నిర్వహిస్తున్న పోలీస్ అధికారులతో మాట్లాడారు. ఈవీఎంలకు ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు 24 గంటలు గట్టి బందోబస్తు నిర్వహించాలన్నారు. ఎలాంటి సమస్య ఎదురైనా అధికారుల దృష్టికి తీసుకురావాలన్నారు. పోలీస్ సిబ్బందికి అన్ని సదుపాయాలు కల్పించాలని ఏవోకి తెలిపారు. ఈ కార్యక్రమంలో కలెక్టరేట్ ఏఓ అబ్దుల్ రెహమాన్ పాల్గొన్నారు.



కలెక్టరేట్ వద్ద ఈవీఎం గోడౌన్‌లను పర్యవేక్షిస్తున్న కలెక్టర్, ఎన్నికల అధికారి ప్రశాంత్ జీవన్ పాటిల్

**కలెక్టర్, సీపీని కలిసిన టీఎన్‌జీవో నాయకులు**

సిద్దిపేట అర్బన్, డిసెంబర్ 4 : అసెంబ్లీ ఎన్నికలు సజావుగా నిర్వహించినందుకు టీఎన్‌జీవో ఆధ్వర్యంలో సిద్దిపేట కలెక్టర్ ప్రశాంత్ జీవన్ పాటిల్, సీపీ శ్వేతలను సోమవారం మర్యాద పూర్వకంగా కలిసి ధన్యవాదాలు తెలిపారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. ఎన్నికలు, కౌంటింగ్ సమర్థవంతంగా నిర్వహించడంలో ఉద్యోగుల పాత్ర ఉందని.. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరుగకుండా పని చేశారని.. భవిష్యత్తులో ఇంకా మరెన్నో ఎన్నికలు నిర్వహిస్తారని ఆశిస్తున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా జిల్లా టీఎన్‌జీవో నాయకులు మాట్లాడుతూ.. కలెక్టర్ సూచనలు, సలహాల మేరకు ఎన్నికలు నిర్వహించామని.. ఈ సందర్భంగా ఉద్యోగులందరికీ ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో టీఎన్‌జీవో సిద్దిపేట జిల్లా అధ్యక్షుడు గ్యాదరి పరమేశ్వర్, కార్యదర్శి విక్రమ్‌రెడ్డి, నాయకులు సురేందర్‌రెడ్డి, సత్యనారాయణ పాల్గొన్నారు.

# పోక్సో కేసులో పదేండ్ల జైలు శిక్ష

మెదక్ అర్బన్, డిసెంబర్4: పోక్సో కేసులో ఒకరికి పదేండ్ల జైలు శిక్షతోపాటు రూ.లక్ష జరిమానాను జిల్లా ప్రధాన న్యాయమూర్తి లక్ష్మీశారద విధించినట్లు ఎస్పీ రోహిణి ప్రియదర్శిని సోమవారం తెలిపారు. పాపన్నపేట పోలీస్‌స్టేషన్ పరిధిలో నమోదైన పోక్సో కేసులో పూర్తి సాక్ష్యాధారాలను పరిశీలించిన జడ్జి నేరస్తుడికి జైలు శిక్ష విధించిందన్నారు. నిందితుడికి శిక్షపడేలా వాదనలు వినిపించిన అదనపు పబ్లిక్ ప్రాసిక్యూటర్ రాజ్‌కుమార్ ఇన్వెస్టిగేషన్ అధికారులు, కోర్టు కానిస్టేబుళ్లను ఎస్పీ అభినందించారు.

# వడియారం శివారులో మహిళ మృతదేహం లభ్యం

చేగుంట, డిసెంబర్4: వడియారం శివారులో గుర్తు తెలియని మహిళ మృతదేహం లభ్యమైనట్లు చేగుంట పోలీసులు తెలిపారు. వడియారం శివారులోని జాతీయ రహదారి సమీపంలో ఉన్న రెండు కల్వర్టు మధ్యలో కాలిన గుర్తు తెలియని 20 నుంచి 30 ఏండ్ల వయస్సున్న మహిళ మృతదేహం గుర్తించినట్లు తెలిపారు. ఎరుపు రంగు డ్రెస్, రెండు కాళ్ల గోర్లకు పింక్ కలర్ నెయిర్‌పాలిష్ ఉన్నట్లు, ఎవరో చంపి ఇక్కడకు తీసుకొచ్చి కాల్చి పడేసినట్లు చేగుంట పోలీసులు తెలిపారు.

# సాయికుమార్‌కు బుక్ ఆఫ్ రికార్డులో చోటు

సిద్దిపేట టౌన్, డిసెంబర్ 4: సిద్దిపేట ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఎమ్మెస్సీ ఫిషరీస్ ద్వితీయ సంవత్సరం చదువుతున్న విద్యార్థి భూక్యా సాయికుమార్‌కు తెలంగాణ బుక్ ఆఫ్ రికార్డులో స్థానం దక్కింది. ఈ మేరకు కళాశాలలో సోమవారం ప్రత్యేకంగా సభ ఏర్పాటు చేసి ఆయన్ను అభినందించారు.అనంతరం ప్రిన్సిపాల్ డాక్టర్ ప్రసాద్ మాట్లాడుతూ.. తెలంగాణలో లభించే దాదాపు 46 రకాల చేపలను గుర్తించి భద్రపర్చినందుకు సాయికుమార్‌కు బుక్ ఆఫ్ రికార్డులో స్థానం లభించిందన్నారు. విద్యార్థి దశలోనే ఐదు అంతర్జాతీయ పరిశోధన పత్రాలను సమర్పించిన సాయికుమార్‌ను అధ్యాపకులు మధుసూదన్, అయెధ్యారెడ్డి, విశ్వనాథం, మధుసూదన్‌రెడ్డి, పుణ్యమ్మ, వైకుంఠచారి, రామ్‌కుమార్, వెంకటేశ్, జగదీశ్వరాచారి అభినందించారు.



# మొక్కులు చెల్లించుకున్న బీఆర్ఎస్ శ్రేణులు

కౌల్చారం, డిసెంబర్ 4: నర్సాపూర్ ఎమ్మెల్యేగా సునీతారెడ్డి ఎంపిక కావడంతో కౌల్చారం మండలం అప్పాజిపల్లి, పోతంశెట్‌పల్లి గ్రామాలకు చెందిన బీఆర్ఎస్ శ్రేణులు సోమవారం యాదాద్రికి వెళ్లి మొక్కులు చెల్లించుకున్నారు.

# శ్రీగురుపీఠం శిలాన్యాస ఆహ్వాన పత్రికలు అందజేత

శివ్వంపేట, డిసెంబర్ 4: శివ్వంపేట మండలంలోని గూడూరు గ్రామంలో నిర్మిస్తున్న శ్రీగురుపీఠం దేవాలయానికి ఈనెల 7న శిలాన్యాసం చేయనున్న విషయం విధితమే. శ్రీగురుపీఠం చారిటబుల్ ట్రస్టు చైర్మన్, హైకోర్టు సీనియర్ న్యాయవాది శివకుమార్‌గౌడ్, వేద పండితులు శాస్త్రుల వెంకటేశ్వరశర్మతోపాటు ట్రస్టు సభ్యులు కలిసి ఆహ్వాన పత్రికలు అందజేస్తున్నారు. సోమవారం సాయి సత్సంగ్ ప్రవచకుడు మార్లెళ్ల మోహన్‌రావు, ప్రముఖ రచయిత మైనంపాటి ప్రసాద్, సాయివాగ్గేయకారుడు కృష్ణావర్జుల రాజేంద్రప్రసాద్, సాయిదర్బార్ ట్రస్టీ మండవ శ్రీధర్‌కు ఆహ్వాన పత్రికలు అందజేశారు.



ఆహ్వాన పత్రిక అందజేస్తున్న మోహన్‌రావు

# పటాన్‌చెరు ఆర్వోపై ఈసీకి ఫిర్యాదు చేస్తా

పటాన్‌చెరు, డిసెంబర్ 4: పటాన్‌చెరు రిటర్నింగ్ అధికారి దేవుజాపై ఎన్నికల సంఘానికి ఫిర్యాదు చేస్తామని కాంగ్రెస్ అభ్యర్థి కాట శ్రీనివాస్‌గౌడ్ తెలిపారు. సోమవారం అశోక్‌నగర్‌లో విలేకరులతో కాట శ్రీనివాస్‌గౌడ్ మాట్లాడారు. ఆదివారం నిర్వహించిన ఎన్నికల కౌంటింగ్‌పై పలు అనుమానాలు ఉన్నాయన్నారు. ఈ ఎన్నికల్లో పోలైన ఓట్లకు, ప్రకటించిన ఓట్లకు వ్యత్యాసం ఉన్నదని ఆరోపించారు. తక్కువ ఓట్లను ఆర్వో చూపారని పేర్కొన్నారు. రౌండ్ 12 నుంచి 18 వరకు అనేక అవకతవకలు కనిపించాయన్నారు. మధ్యాహ్నం పోస్టల్ బ్యాలెట్లు ఓపెన్ చేసి ఏజెంట్ల ధ్యాసను మరల్చారన్నారు. బూత్ నెంబర్ 70,198 రిజల్ట్‌తోపాటు పలు ఈవీఎంలకు వేసిన సీల్ తొలిగించి ఉన్నాయన్నారు. సమావేశంలో ఇస్నాపూర్ ఎంపీటీసీ గడ్డం శ్రీశైలం, కాంగ్రెస్ నాయకులు సుధాకర్‌గౌడ్, నరేందర్‌రెడ్డి, నర్సింహారెడ్డి, రాజిరెడ్డి, కౌన్సిలర్ మున్నా, వెంకన్నయాదవ్ పాల్గొన్నారు.

# ఓటమిని తట్టుకోలేక ఆత్మహత్యాయత్నం

హుస్నాబాద్, డిసెంబర్ 4: బీఆర్ఎస్ హుస్నాబాద్ ఎమ్మెల్యే అభ్యర్థి వొడితెల సతీశ్‌కుమార్ ఓటమిని తట్టుకోలేక మనస్తాపానికి గురైన బీఆర్ఎస్ నాయకుడు కూతాటి విజయభాస్కర్ ఆదివారం రాత్రి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. ఉదయం సిద్దిపేటలో కౌంటింగ్ సెంటర్ వద్దకు వచ్చిన ఆయన సాయంత్రం వరకు ఎన్నికల ఫలితాలను స్థానిక నాయకులతో కలిసి పరిశీలించాడు. సతీశ్‌కుమార్ ఓటమిపాలయ్యాడని తెలిసి మనస్తాపానికి గురయ్యాడు. ఇంట్లో ఉన్న ప్లాస్టిక్ వస్తువులు అంటుపెట్టే గమ్ము రసాయనాన్ని తాగాడు. ఇది గమనించిన కుటుంబ సభ్యులు ఆయన్ను హుస్నాబాద్ సర్కారు దవాఖానకు తరలించారు. ప్రథమ చికిత్స అనంతరం సిద్దిపేట దవాఖానకు తరలించి చికిత్స చేయిస్తున్నారు. స్థానిక బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు ఆయన్ను పరామర్శించారు.

# రాష్ట్ర స్థాయి అథ్లెటిక్స్ పోటీలకు హుస్నాబాద్ విద్యార్థి



బానోతు ఇసాక్

హుస్నాబాద్, డిసెంబర్4: రాష్ట్ర స్థాయి అథ్లెటిక్స్ పోటీలకు హుస్నాబాద్ ప్ర భుత్వ బాలుర ఉన్నత పాఠశాలకు చెందిన బానోతు ఇసాక్ ఎంపికైనట్లు పాఠశాల హెచ్ఎం వాసుదేవరెడ్డి తెలిపారు. 5కిలోమీటర్ల రేస్‌వాక్‌లో జిల్లా స్థాయిలో ఉత్తమ ప్రతిభ కనబర్చి రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైనట్లు ఆయన చెప్పారు. హనుమకొండలో జరిగే రాష్ట్ర స్థాయి పోటీలో పాల్గొంటారన్నారు.

నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్

WANTED

★ రామకృష్ణ గ్రూప్ (AP, న్యూఢిల్లీ No.1) శ్రీమంతుల ఇండ్లలో వృద్ధుల/పేషెంట్ల సేవకు ఇంటి/వంట పని, బేబీకేర్ కొరకు M/F వర్కర్లు 12/24 గంటల డ్యూటీ కొరకు కావలెను. ఏజెంట్లకు 5 వేలు కమీషన్. వృద్ధుల/పేషెంట్ల సేవకు వర్కర్లను 24x7 మీ ఇంటికి పంపగలము. 9281452762, 9515108830.
NT-314461

గమనిక: క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్/డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.